క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మోపిదేవి: మహాత్మా జ్యోతిబా పూలే ఏపీ వెనుక బడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయంలో(ఇంగ్లిష్ మీడియం) 2024–25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోపిదేవి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వీరరవి మంగళవారం ప్రకటనలో తెలిపారు. మార్చి 1 నుంచి 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సమీపంలోని గురుకుల పాఠశాలలో సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థులకు బాల్ బ్యాడ్మింటన్ రాకెట్లు

నాగాయలంక: స్థానిక జెడ్పీహైస్కూల్‌కు రూ.6 వేల విలువైన బ్యాడ్మింటన్ రాకెట్లను ఆకివీడుకు చెందిన చలమలశెట్టి దిలీప్(కుప్పనపూడి) అందజేశారు. దిలీప్ తండ్రి అప్పారావు జ్ఞాపకార్థం సమకూర్చగా ఎస్ఐ సుబ్రహ్మణ్యం వీటిని వ్యాయామ ఉపాధ్యాయులు కోసూరు పూర్ణచంద్రరావు, గాజుల లక్ష్మీప్రసాద్‌కు ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ



మచిలీపట్నం టౌన్: నగరంలోని 27వ డివిజన్‌లో ఇన్‌చార్జ్, మార్కెట్ యార్డ్‌చైర్మన్ షేక్ అచ్చేబా మంగళవారం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నూతన కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. డివిజన్‌లోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వాటి ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా అచ్చేబా మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డును వినియోగించుకోవాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని వసుమట్ల ఎస్సీ కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం పోగొట్టుకున్న రెండు బాధిత కుటుంబాలకు శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్‌నాయుడు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. బాధితులు పానుగుమాటి సీత, రాధలకు శ్యాంకిశోర్‌నాయుడు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి విజయకుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, తోట నరసింహనాయుడు, పాస్టర్ కట్టా ఏడుకొండలు, కర్రా రవి, కోన శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పెడన: ఎన్నికల సమయం ఆసన్నమైందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని.. మీ ప్రాంతాల్లో ఏం జరిగినా సమాచారం తెలుసుకునేలా ఉండాలని పెడన ఎస్ఐ టి.సూర్యశ్రీనివాస్ అన్నారు. మంగళవారం పెడన పీఎస్‌లో పెడన పట్టణంతో పాటు రూరల్ ప్రాంతంలోని మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించి వారికి ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయంలో విధులు నిర్వహిస్తుండటంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మీ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో పట్టు సాధించాలని, సమాచారం ముందుగా మీకు చేరేలా చూసుకోవాలని తెలిపారు. ఆయనతో ఏఎస్ఐ టి.సురేష్ తదితరులున్నారు.

17న మత్స్యకారుల ఆత్మీయ సమ్మేళనం




మచిలీపట్నంటౌన్: మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ శనివారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సమితి ప్రతినిధులు మంగళవారం తెలిపారు. టీటీడీ కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళన కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. విద్య, వైద్యం, క్రీడలు, గ్రంథాలయాలు, భక్తి, మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి, జలనిధి ఫెడరేషన్, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై మత్స్యకారులకు అవగాహన కల్పిస్తారన్నారు. సమ్మేళనానికి వచ్చే ప్రతినిధులు తెల్ల దుస్తులు ధరించి రావాలని సంఘ సభ్యత్వం పొందాలని కోరారు.

కుట్టుమిషన్లు అందజేత



కోడూరు: కేంద్ర ప్రభుత్వం, ఏపీఐటీసీఓ హైదరాబాద్ ఆర్థిక సౌజన్యంతో మహిళలకు కుట్టు మిషన్లను మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక ఒకటో వార్డులో మహిళలకు 60 రోజులుగా కుట్టు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసిన 30మంది మహిళలకు ఉచితంగా ఎంబ్రాయిడరీ కుట్టు మిషన్లు, టూల్ కిట్లను అందించారు. సంస్థ పీడీ సుధీర్‌కుమార్, ఆర్ఐ సుభాషిణి, సువర్చల, కోట కరుణకుమార్, అరుణ పాల్గొన్నారు.

విజ్ఞాన వేదిక




మచిలీపట్నం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న దృశ్యం

- నిరుద్యోగులకు బాసట..
- మచిలీపట్నంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం
- అందుబాటులో పోటీ పరీక్షల పుస్తకాలు
- పోటీ పరీక్షలకు సన్నద్ధం

మచిలీపట్నంటౌన్: నిరుద్యోగ యువత ఉద్యోగ సాధనకు అండగా నిలుస్తోంది మచిలీపట్నంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం. వీరి విజ్ఞాన సముపార్జనకు వేదికగా మారింది. ఈ గ్రంథాలయానికి నిత్యం వంద మందికి పైగా నిరుద్యోగులు విచ్చేసి వివిధ పుస్తకాలను చదువుతున్నారు. త్వరలో జరగనున్న డీఎస్సీ, ఈ నెల 25న జరిగే గ్రూప్–2 పరీక్షలు రాసేందుకు సన్నద్ధమవుతున్నారు. వీటితో పాటు పలు గ్రూప్స్, బ్యాంకింగ్, సివిల్స్, పోలీస్, సచివాలయం, ఫారెస్ట్, రైల్వే తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

అందుబాటులో పుస్తకాలు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగుల కోసం 10 వేలకు పైగా వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో



రిఫరెన్స్ విభాగంలోని పుస్తకాలు

ఉన్నాయి. గ్రంథాలయంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో నిరుద్యోగులు తెచ్చుకునే పుస్తకాలను పఠిస్తారు. ఏసీ వసతితో ఉన్న సెకండ్ ఫ్లోర్‌లోని రిఫరెన్స్ విభాగంలో పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో వార్తాపత్రికలు, వార, పక్ష పత్రికలు, కరెంట్ ఎఫైర్స్ పుస్తకాలు ఉంటాయి. పోటీ పరీక్షల పుస్తకాలు కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గ్రంథాలయానికి రూ. 6 లక్షలు మంజూరు చేసింది. పోటీ పరీక్షలకు సంసిద్ధమవుతున్న వారి అవసరాల మేరకు పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 293 పుస్తకాలను కొనుగోలు చేయగా, మరో 372 పుస్తకాలు కొద్ది రోజుల్లో గ్రంథాలయానికి చేరనున్నాయి.

ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు..

గ్రంథాలయం రోజూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8వరకు అందుబాటులో ఉంటుంది. నిరుద్యోగులు అధికశాతం ఉదయం 8 గంటలకే ఇక్కడకు చేరుకుంటున్నారు. మచిలీపట్నంతో పాటు పరిసర ప్రాంతాల నిరుద్యోగులు ఇక్కడకు వస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇక్కడే చదువుతున్నారు. శుక్రవారం, సెలవు రోజుల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వీరి కోసం ప్రత్యేకంగా గ్రంథాలయం తెరుస్తున్నారు.

పోటీ పరీక్షల అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా..



జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగుల కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశాం. ప్రత్యేకంగా లైట్లు, ఫోన్, ల్యాప్‌టాప్‌ల చార్జింగ్ అమర్చాం. నిరుద్యోగులకు అవసరమైన పుస్తకాలను వారి కోరికపై కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుతున్నాం. ఇక్కడ చదువుకున్న ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగులయ్యారు. ఇక్కడ పరీక్షలకు సిద్ధమయ్యే వారు కూడా ఉద్యోగాలు పొంది జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లాలని కోరుకుంటున్నాను.

– ఎంవీడీటీ నగేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

ఉద్యోగ సాధనే లక్ష్యం



ఈ నెల 25వ తేదీన జరిగే గ్రూప్–2 పరీక్ష రాసేందుకు ప్రిపేర్ అవుతున్నాను. ఉద్యోగసాధనే లక్ష్యంగా గ్రంథాలయంలోని రిఫరెన్స్ విభాగంలో పుస్తకాలు చదువుతున్నాను. ఇక్కడి పుస్తకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.

–డి.సురేష్, మల్కాపట్నం

నగరంలో ఎమ్మెల్యే పేర్ని నాని పర్యటన

మచిలీపట్నంటౌన్: ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) మంగళవారం నగరంలో విస్తృతంగా పర్యటించారు. 22వ డివిజన్ దేవునితోట యానాదికాలనీలో పర్యటించి వారి సమస్యలను అడిగి పరిష్కరించడానికి కృషి చేశారు. వారిలో ఆధార్‌కార్డులు లేనివారితో దరఖాస్తులు చేయించారు. ఉల్లింగిపాలెం బొంబాయికాలువ పక్కన నాలుగు డివిజన్లలో లబ్ధిదారులకు ఏర్పాటు చేసిన జగనన్న కాలనీని మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మతో కలిసి ఆయన పరిశీలించారు. వైఎస్సార్ కాలనీ, బందరుకోట తదితర ప్రాంతాల్లో పర్యటించారు.

టిడ్కో గృహాల పనుల పరిశీలన

గోసంఘం వద్ద ఉన్న టిడ్కో గృహ సముదాయాన్ని ఎమ్మెల్యే పేర్ని నాని పరిశీలించారు. చెక్‌లిస్ట్ పనుల్లో కొన్ని పూర్తి చేయకపోవడంతో సంబంధిత



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని

అధికారులపై పేర్ని నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, కమిషనర్ బాపిరాజు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ చింతా మౌనిక, కార్పొరేటర్ తిరుమలశెట్టి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

చెత్త విభజనపై చైతన్యం పెరగాలి

చల్లపల్లి: చెత్త విభజనపై ప్రతి కుటుంబంలో చైతన్యం పెరగాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సలహాదారు వేలేరు శ్రీనివాసన్ తెలిపారు. స్థానిక సాలిడ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సెంటరులో మంగళవారం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు, గ్రామస్తులకు పొడి చెత్త విభజన విధానాలపై శిక్షణ ఇచ్చారు. పొడి చెత్తను ఎన్నిరకాలుగా విడదీయాలో వివరించారు. ఇంటినుంచే చెత్త విభజన ప్రారంభం కావాలని సూచించారు. మన కోసం మనం ట్రస్ట్ సిబ్బంది, స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు, పద్మావతి హాస్పిటల్ సిబ్బంది శిక్షణ పొందారు. అనంతరం రెండవ డ్రై లీఫ్ కంపోస్ట్ పిట్ ఏర్పాటు పనులు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ తరిగోపుల పద్మావతి పాల్గొన్నారు.



చెత్త విభజనపై శిక్షణ ఇస్తున్న వేలేరు శ్రీనివాసన్

జగనన్నతోనే సంక్షేమ పాలన

గూడూరు: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో సంక్షేమ పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గూడూరులో మంగళవారం ప్రజాదీవెన యాత్ర నిర్వహించారు. గడప గడపనకు వెళ్లిన ఉప్పాల రాము జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు జరిగిన మేలును వివరించారు. కరోనా వంటి కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలు ఆపకుండా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నిధులు ఇచ్చి ఆదుకున్న ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. పూర్తి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అర్హులకు లబ్ధి చేకూర్చుతున్న జగనన్నకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని రాము ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సమస్య పరిష్కారం

తాగునీటి సమస్య పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమిస్తానని ఉప్పాల రాము హామీ ఇచ్చారు. గూడూరులో పర్యటించిన రాము దృష్టికి పలువురు మహిళలు తాగునీటి సమస్యను తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన రాము మాట్లాడుతూ ఇప్పటికే తాగునీటి సమస్యను మొదటి ప్రాధాన్యతగా భావించి జెడ్పీ నుంచి అత్యధిక నిధులు కేటాయిస్తారన్నారు. గ్రామాల్లో మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేస్తున్నామని, తద్వారా



మహిళకు పథకాల బుక్‌లెట్ అందించి జగనన్నకు మద్దతు ఇవ్వాలని కోరుతున్న ఉప్పాల రాము

కుళాయిల ద్వారా నాణ్యమైన తాగునీరు అందిస్తామన్నారు. మహిళలు అడుగడుగునా ఆయనకు హారతులిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ గౌరిపర్తి వరలక్ష్మి, పీఏసీఎస్‌చైర్మన్ కారుమంచి కామేశ్వరరావు, సర్పంచి లింగం సులోచనారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు పర్ణం పెదబాబు, గౌరిపర్తి రవికుమార్, బత్తిన త్రినాథ్, ఆకూరి శ్రీను, అట్లూరి వెంకటేశ్వరరావు, వీరంకి సుబ్రహ్మణ్యం, లింగం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం చేయాలి

కోనేరుసెంటర్: యువత రక్తదానం చేయాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జ్ఞానమణి పిలుపునిచ్చారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జ్ఞానమణి ప్రారంభించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఇతర విశ్వవిద్యాలయాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు తాను చూడలేదన్నారు. శిబిరంలో 40 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వీర బ్రహ్మచారి, రెడ్‌క్రాస్ కార్యదర్శి శంకర్‌నాథ్, కోశాధికారి బాలాజీ, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి రామశేఖర్ రెడ్డి, రెడ్‌క్రాస్ వైద్యులు హనుమంతయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి రవి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో వీసీ జ్ఞానమణి

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



చిలకలపూడి(మచిలీపట్నం): ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రంలో స్థానిక నోబుల్ కళాశాల విద్యార్థులు ఓటు వేసే విధానాన్ని తెలుసుకున్నారు. పోలింగ్ సిబ్బంది విద్యార్థులకు ఈవీఎం, వీవీ ప్యాట్‌ల వినియోగం, ఓటు వేసే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సిబ్బంది అనిత విద్యార్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు.

ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుకు 'కొమ్మారెడ్డి' విద్యార్థి

బంటుమిల్లి: కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే ఇన్‌స్పైర్ మనాక్ 2023–24 విద్యా సంవత్సరం అవార్డుకు స్థానిక కొమ్మారెడ్డి హైస్కూల్ విద్యార్థి కాగిత ప్రభువిశాల్ ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ కె. కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో సృజన వెలికితీయడానికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ. 10వేల అవార్డుకు ప్రభువిశాల్ ఎంపిక కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేసి అభినందించారు. ఎంపికైన విశాల్‌కు కరస్పాండెంట్ కె. శోభ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

డివిజన్లలో సమస్యల పరిష్కారానికి కృషి



మచిలీపట్నంటౌన్: పలు డివిజన్లలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. మంగళవారం ఉదయం నగరంలోని 1వ డివిజన్‌లో ఆమె విస్తృతంగా పర్యటించారు. పారిశుద్ధ్యం, మురుగు పారుదల, తాగునీటి సరఫరా తదితర అంశాలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో కమిషనర్ బాపిరాజు, 1వ డివిజన్ కార్పొరేటర్ జోగి చిరంజీవి, అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి భావనారుషి కల్యాణోత్సవాలు

పెడన: పట్టణంలోని పద్మశాలీ బహోత్తమ సంఘం ఆధ్వర్యాన స్థానిక 2వ వార్డులోని శ్రీభద్రావతి సమేత శ్రీభావనరుషి స్వామివార్ల కల్యాణ మహోత్సవ సంబరాలను రెండు రోజులు పాటు నిర్వహించడానికి సంఘం నాయకులు, సభ్యులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ఆలయాన్ని ముస్తాబు చేయగా, ప్రాంగణంలోనే కాకుండా ప్రధాన మార్గంలో చలువ పందిరి వేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ నెల 15, 16 తేదీల్లో జరిగే సంబరాల్లో తొలిరోజు గురువారం ఉదయం గణపతి పూజతో ప్రారంభించి ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించనున్నారు. రాత్రి 10 గంటల తరువాత స్వామివార్ల ఊరేగింపు చేయనున్నారు. 16వ తేదీ ఉదయం 8.02గంటలకు కల్యాణం ఘట్టాన్ని ప్రారంభించనున్నారు. కల్యాణం అనంతరం 11.30 గంటలకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.



ముస్తాబైన శ్రీభద్రావతి సమేత శ్రీభావనారుషి ఆలయం

కార్తికేయుని ఊరేగింపునకు ఎడ్లబండి అందజేత



మోపిదేవిలో దేవాలయానికి ఎడ్ల బండి అందిస్తున్న దాత శ్రీకాంత్ కుటుంబ సభ్యులు



వెండి నాగపడగను సమర్పిస్తున్న భక్తులు రామకృష్ణ, సుబ్రహ్మణ్యేశ్వరరావు

మోపిదేవి: మోపిదేవి ఆలయంలో శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఊరేగింపునకు హైదరాబాద్‌కు చెందిన అమరం శ్రీకాంత్, దీప్తి వుడ్‌తో తయారుచేసిన ఎడ్ల బండిను సమర్పించారు. గతంలో దేవస్థానం ఇచ్చిన సూచనలతో సిద్ధం చేసిన కొయ్య బండిని ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావుకు మంగళవారం అందజేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న దాతను ఆలయ మర్యాదలతో సత్కరించారు. మాజీసర్పంచ్ రావి నాగేశ్వరరావు, కావూరి రామకృష్ణ, ఆలయ అధికారులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వామివారికి వెండి నాగపడగ

మచిలీపట్నంకు చెందిన కె. రామకృష్ణ, సుబ్రహ్మణ్యేశ్వరరావు స్వామివారికి 900 గ్రాముల వెండితో తయారుచేసిన నాగపడగను సమర్పించారు. మంగళవారం ఉదయం ఆలయానికి వచ్చిన వారు స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం వెండిపడగను ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు అందించారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధం

- వసుమట్ల ఎస్సీ కాలనీలో అర్ధరాత్రి అగ్ని ప్రమాదం
- బాధితులకు ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని పులిగడ్డ శివారు వసుమట్ల ఎస్సీ కాలనీలో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. సేకరించిన వివరాలు ప్రకారం వసుమట్ల ఎస్సీ కాలనీకి చెందిన పానుగుమాటి సీత, పానుగుమాటి రాధకు చెందిన పూరిళ్లకు అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో మంటలు వ్యాపించి దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరి మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని సిబ్బంది భావిస్తున్నారు. తొలుత సీత ఇంటిలో ప్రమాదం జరగ్గా పక్కనే ఉన్న రాధ ఇంటికి మంటలు వ్యాపించాయి. ఘటనలో ఇంట్లో సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతవ్వగా కట్టు బట్టలతో మిగిలారు. సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు.



అగ్నిప్రమాద బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

బాధిత కుటుంబాలకు పరామర్శ

అగ్నిప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఘటనా స్థలికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయకుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం జగన్ రైతుల పక్షపాతి

వైఎస్సార్ సీపీ బందరు ఇన్‌చార్జి పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుల పక్షపాతి అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. తాళ్లపాలెం గ్రామంలోని తాళ్లపాలెం 1, 2 రైతు భరోసా కేంద్రాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆర్‌బీకేలను ప్రారంభించారన్నారు. రైతులకు గతంలో రైతులకు ఎలాంటి అవసరం వచ్చినా దూర ప్రాంతంలో ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయానికి మైళ్ల దూరం వెళ్లాల్సి వచ్చేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సొంత గ్రామాల్లోనే వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ అత్యుత్తమ సేవలను అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, కానూరు పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీకాకుళం నాగేశ్వరరావు, మధిర సర్పంచి అశ్విని, ఎంపీడీవో బాలకృష్ణ రావు, మండల ఏవో హారిక, రైతులు పాల్గొన్నారు.



తాళ్లపాలెంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కిట్టు

ఐఐటీ, జేఈఈలో 'స్టార్' ప్రతిభ



మచిలీపట్నంటౌన్: ఐఐటీ, జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని నగరంలోని స్టార్ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ పి.శ్రీరామ్, అడ్మిన్ డైరెక్టర్ బి.అయ్యప్పస్వామి మంగళవారం తెలిపారు. జేఈఈ బీటెక్ విభాగంలో తమ కళాశాల విద్యార్థి కె.శ్రీకర్ 98.29 శాతం, పవన్‌సాయిశ్రియాన్స్ 97.73, పి.ఖనిజ 96.20, కె.వంశీరఘురామ్ 95.73, జి.సాయిఅభినయ 95.28, జె. లక్ష్మీతేజస్వి 94.84, బి డింపుశరవాని 92.75, ఎ నేహిత 91.64, టి షణ్ముఖలక్ష్మి 90.69 శాతాలను సాధించారని తెలిపారు.

రేపటిలోగా ఈ క్రాప్ చేయించండి

పెడన: రబీ సాగులో అపరాల పంటలకు కూడా తప్పనిసరిగా ఈ క్రాప్ ఈకేవైసీ చేయించాల్సిందేని, అలా చేయని రైతులుంటే సమీపంలోని ఆర్‌బీకేలలో చేయించుకోవాలని పెడన వ్యవసాయశాఖాధికారి సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. ఆయన మండలంలోని కొంగంచర్ల, చేవేంద్ర గ్రామాల్లో మంగళవారం పర్యటించి ఈ క్రాప్ ఈకేవైసీలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పండించే ఖరీఫ్‌లో వరి పంట, రబీలో అపరాలను ఏ పంటకు ఆ పంట ఈ క్రాప్, ఈకేవైసీలు చేయించాలని స్పష్టం చేశారు. పంట నష్టపోయినా, పండించిన పంటను విక్రయించుకోవడానికి మద్దతు ధర లభించడానికి ఇవి ఉపయోగపడతాయని తెలిపారు. సబ్సిడీపై అందించే విత్తనాలు, ఎరువులు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీలోగా సమీపంలోని ఆర్‌బీకేలకు వెళ్లి ఆధార్ నంబరు, పట్టదారు పాస్‌బుక్‌తో పాటు సెల్ ఫోన్ నంబరు కూడా తెలియజేయాలన్నారు.

కుంగిన రోడ్డుకు మరమ్మతులు

నడకుదురు(చల్లపల్లి): చల్లపల్లి – నడకుదురు ప్రధాన రహదారిలో వంతెన అప్రోచ్ సమస్యను సీఐ సీహెచ్ నాగప్రసాద్ చొరవతో పరిష్కరించినట్లు నడకుదురు సర్పంచ్ గౌరిపర్తి సురేష్ తెలిపారు. స్థానిక కరకట్ట వంతెన అప్రోచ్ రోడ్డు గోతులు పడి కుంగడంతో మరమ్మతుల కోసం సీఐ నాగ ప్రసాద్ ఒక లోడు రబ్బీసు పోయించారని సర్పంచ్ తెలిపారు.

కేయూలో ప్రాంగణ ఎంపికల ప్రక్రియ

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలో ప్రాంగణ ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. మంగళవారం విశ్వవిద్యాలయ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ విభాగం ఆధ్వర్యాన విజయవాడ చైతన్య విద్యాసంస్థలు నిర్వహించిన రాత పరీక్షల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గణితం, ఆంగ్లం, బోటనీ, జువాలజీ, రసాయన శాస్త్రం, ఎంసీఏ విభాగాల విద్యార్థులు హాజరయ్యారు. చైతన్య విద్యాసంస్థల్లో అధ్యాపకుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారని విశ్వవిద్యాలయ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ విభాగం సమన్వయకర్త జి.కిషోర్ తెలిపారు. కార్యక్రమంలో చైతన్య విద్యాసంస్థల అకాడమిక్ సమన్వయకర్తలు ఎం.అశోక్ కుమార్, ఎ.చక్రధర్ ప్రసాద్, పి.భానుకృష్ణ, మచిలీపట్నం చైతన్య కాలేజీ ప్రిన్సిపాల్ ఆర్వీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.